

ఆక్రమణలు తొలగిస్తాం

ఉండి, ఆకివీడు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్లు ఫణిబాబు, గోకరాజు శివరామరాజు

కాళ్ల : పంట, మురుగు కాలువల ప్రక్షాళన పనులు దాతల సహకారం చేపట్టి, కాలువలకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలు తొలగిస్తామని ఉండి, ఆకివీడు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్లు తోట ఫణిబాబు, గోకరాజు శివరామరాజులు అన్నారు. ఆదివారం జువ్వలపాలెం గ్రామంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో పంట కాలువల్లో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయిన గత ఖరీఫ్‌లో దాతల సహకారంతో పంట, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షులు మంతెన కొండల రామరాజు, గొర్ల లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

మత్స్యశాఖలో దోపిడీ దందా..!

'మత్స్యశాఖలో కొంతమంది అధికారులు దోపిడీ దందా తారాస్థాయికి చేరింది. 'నిబంధనలతో సంబంధం లేదు.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పట్టించుకోరు.. వందల ఎకరాల చేపల చెరువులను చేసే బడాబాబులకు ఏం చెబితే అదే శాసనం అన్నట్లు ముందుకు సాగుతూ సన్న, చిన్నకారు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.. బడాబాబులు కన్నుపడిన చేపల చెరువులను వారికి అప్పగించేందుకు చిన్న, సన్నకారు రైతులకు అడ్డగోలుగా నోటీసులు జారీ చేసి బెదిరించి దారికి తెచ్చేందుకు ఎంతకైనా తెగిస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి.' అనేక ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు కొనసాగుతున్నప్పటికీ నిడమర్రు మండలం మత్స్యశాఖ అధికారి (ఎఫ్‌డిఒ) మాత్రం తన రూటే సెపరేటు అంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల రెవెన్యూ అధికారులు, జిల్లా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులు మత్స్యశాఖ కమిషనర్ వద్దకు సమస్యను తీసుకెళ్లడంతో ఎఫ్‌డిఒపై విచారణకు ఆదేశించారు. విచారణైనా సరిగా నిర్వహిస్తారో, లేదో చూడాల్సి ఉంది.



దాదాపు ఏడాదిగా నిలిచిపోయిన చిన్న, సన్నకారుల రైతుల ఆరెకరాల చేపల చెరువు

- చిన్న, సన్నకారు రైతుల చేపల చెరువులపై బడాబాబుల కన్ను
- లీజుకు ఇవ్వనంటే రంగంలోకి మత్స్యశాఖ అధికారులు
- అడ్డగోలుగా నోటీసులు జారీచేసి రైతులకు బెదిరింపులు
- నిడమర్రు మండలం మత్స్యశాఖ అధికారి దందా తారాస్థాయికి
- చోద్యం చూస్తున్న తహశీల్దార్ ఆధ్వర్యంలోని మండల కమిటీ
- రెవెన్యూ అధికారులు సైతం బడాబాబులతో మిలాఖత్, భారీగా ముడుపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం ఆదవికొలను గ్రామం తిమ్మాపూర్‌గూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 164-2, 3 మరికొన్ని సర్వే నెంబర్లలో ఐదురుగు సన్న, చిన్నకారు రైతులు ఆరెకరాల చేపల చెరువు తవ్వుకున్నారు. ఆ చెరువుకు పక్కనే సర్వే నెంబర్లు 148 నుంచి 182 మధ్యలో దాదాపు 150 ఎకరాల్లో చేపల చెరువు తవ్వకాలు సాగించారు. 2015 కాలంలో ఈ చెరువు తవ్వకంపై తీవ్ర దుమారం రేగింది. సర్వే నెంబర్లు 148-163లో తవ్విన 70 ఎకరాల చేపల చెరువులో ప్రభుత్వ పంటబోదెను కలిపేసి తవ్వకం సాగించడంపై అప్పట్లో అధికారులు పలు చర్యలు సైతం తీసుకున్నారు. తర్వాత మళ్లీ మారేడుకాయ చేసి ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ చేపల సాగు సాగించేస్తున్నారు. 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చేపల చెరువులను లీజుకు తీసుకున్న బడాబాబులు పక్కనే ఉన్న ఆరెకరాల సన్న, చిన్నకారుల రైతుల చేపల చెరువుపై పడింది. సదరు బడాబాబులు చెరువు లీజుకు ఇచ్చేందుకు చిన్నకారు రైతులు అంగీకరించలేదు. దీంతో నిడమర్రు మండలంలోని మత్స్యశాఖ అధికారి (ఎఫ్‌డిఒ)గా పని చేస్తున్న రవికుమార్‌ను రంగంలోకి దింపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న చేపల చెరువుల్లో దాదాపు 80 శాతం రొయ్యల సాగు ఉంది. రైతులను బెదిరించి దారికి తెచ్చే కుట్రలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు చేస్తున్నారంటూ చిన్న, సన్నకారు రైతులకు నోటీసులు జారీ చేశారు. మత్స్యశాఖ అధికారికి ఫిర్యాదు ఇచ్చినట్లు చెబుతున్న వ్యక్తి చెరువులో సైతం రొయ్యల సాగే చేస్తుండటం గమనార్హం. దీంతో సదరు రైతులు రొయ్యల సాగు నిలిపివేసి చేపల సాగుకు లీజుకు ఇచ్చారు. దీంతో సీపేజీ (ఊటబోదె) తవ్వలేదంటూ మరో నోటీసు ఇచ్చారు. ఇంతకీ ఏమిటంటే బడాబాబులు సాగు చేస్తున్న పక్కనే ఉన్న 150 ఎకరాల్లోని చేపల చెరువులకు సీపేజ్ (ఊటబోదె) లేదు. జిల్లాలో సాగుతున్న దాదాపు 70 శాతానికిపైగా చెరువులకు సీపేజ్ లేదంటే అతిశయోక్తి కాదు. కాగా 2024 ఆగస్టు నుంచి రైతులను ఇబ్బందులు పెడుతూ చెరువులో ఎటువంటి సాగు జరగకుండా నిలిపివేశారు.

ప్రభుత్వ భూమి ఉన్న చెరువులో దర్జాగా సాగు.. చోద్యం చూస్తున్న అధికారులు

పక్కనే ఉన్న పెద్ద చేపల చెరువులో 159-4లో 94 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. 2015 మధ్యకాలంలో ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించి రెవెన్యూ అధికారులు చెరువును నిలుపుదల చేశారు. ఇప్పుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న చేపల చెరువులో దర్జాగా చేపల సాగు సాగుతుండగా చిన్న, సన్నకారు రైతుల చెరువులో మాత్రం సాగు నిలిపివేశారు. దీనిపై బాధిత రైతులు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన స్పందన లేకుండాపోయింది. అతికష్టం మీద కొంతమందికి నోటీసులు జారీ చేసి మమ అనిపించేశారు. ఎఫ్‌డిఒ తనకు సంబంధం లేని అంశాల్లో సైతం జోక్యం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా నీటి హక్కుల గురించి ప్రస్తావించడం దుర్మార్గపు చర్యలకు పరాకాష్టగా చెప్పొచ్చు. ప్రభుత్వ భూమిలో చేప పిల్ల వేయకుండా అడ్డుకుంటామంటూ వెళ్లిన రెవెన్యూ అధికారులు అటు, విఆర్‌ఒలు సైతం బడాబాబులకు వంతపాడుతూ వెనక్కివచ్చినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మత్స్యశాఖ ఎఫ్‌డిఒ చర్యలను కట్టడిచేయాల్సిన తహశీల్దార్ ఆధ్వర్యంలోని మండల కమిటీ సైతం సరిగా స్పందించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ, జిల్లా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు మత్స్యశాఖ కమిషనర్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ జిల్లా మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. విచారణ ఏవిధంగా చేస్తారో వేచిచూడాల్సి వచ్చింది. దాదాపు ఏడాది కాలంగా చెరువు సాగు నిలిచిపోవడంతో సన్నకారు రైతులు రూ.ఏడు లక్షలకుపైగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీ దీనిపై జోక్యం చేసుకుంటే తప్ప సదరు రైతులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు. మరింత లోతైన విచారణ చేస్తే మత్స్యశాఖలో జరుగుతున్న దందా గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఎఫ్‌డిఒపై విచారణకు ఆదేశాలు వచ్చాయి

బి. నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఏలూరు జిల్లా


నిడమర్రు మండల ఎఫ్‌డిఒకు సంబంధించిన విషయాలు నా దృష్టికి వచ్చాయి. ప్రభుత్వ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు గుర్తించిన రైతుల మేరకు నోటీసులు ఇవ్వడం జరిగింది. నోటీసులు సైతం సరిగా ఇవ్వలేదని రైతులు చెబుతూ రాష్ట్ర ఉన్నతాధికారులకు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎఫ్‌డిఒపై విచారణ చేస్తాం. విచారణాధికారిగా కైకలూరు ఎడి రాజకుమార్‌ను నియమించాం. పది రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి.

కంకర మోస్తూ.. శ్లాబ్ పనులు చేస్తూ

అంబేద్కర్ విగ్రహ శ్లాబ్ నిర్మాణంలో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు అరుంధతీపేటలో జరిగిన అంబేద్కర్ విగ్రహ శ్లాబ్ నిర్మాణ పనుల్లో కార్మికులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం స్వయంగా పాల్గొన్నారు. కంకర పారతో గిన్నెలో వేసుకొని నెత్తి మీద పెట్టుకొని మిల్లర్‌లో వేశారు. అలాగే ఇసుక, సిమెంట్ వేశారు. స్లాబ్ పైకి ఎక్కి కాంక్రీట్ పనులు చేశారు. మండుటెండను సైతం లెక్కజేయకుండా పనిచేశారు. అక్కడే ఆయన టిఫిన్ చేశారు._ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత అంబేద్కర్ జయంతి రోజున అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి పలు పనులు చేపట్టారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిగా ఆర్యపేటలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల శ్లాబ్ నిర్మాణ పనుల్లో పాల్గొని శ్రమదానం చేశారు. అదే రోజు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల విగ్రహాలన్నీ ఎండ, వానకు తడవకుండా రక్షణగా శ్లాబ్ నిర్మాణాలు చేపడతానని చెప్పారు. ఆయా స్లాబ్ పనుల్లో అవకాశం ఉన్నంత వరకూ శ్రమదానం చేస్తానని చెప్పారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని, తన తండ్రి ధర్మారావు పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలన్నింటికీ స్లాబ్ నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేస్తానని చెప్పారు. మహనీయుల విగ్రహాల స్థాపన, వాటి పరిరక్షణ పనుల్లో స్వయంగా పాల్గొంటే ఎంతో ఆనందం, సంతృప్తి ఇస్తుందన్నారు. ఏ పనినైనా ఆదేశాలిచ్చి చేయించడం కంటే ఆచరించి చూపిస్తేనే ప్రజలు అనుసరిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, సవరపు వెంకటేశ్వరరావు, సవరపు నాని బాబు, కొండేటి గాంధీ, లక్కవరపు శ్రీను, వసంతాడ జాను, గుమ్మాపు రాజేష్, సవరపు లాజర్ కొండేటి నరసింహారావు, కొండేటి చిన్న వెంకయ్య, కామంచి కిషోర్, భరతల కిషోర్, గుమ్మాపు సిసీంద్రీ, గుమ్మాపు నవీన్, వీరమల్లు శ్రీను, వాసా మల్లికార్జునరావు పాల్గొన్నారు.



కంకర మోస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

శరవేగంగా అభివృద్ధి పనులు

పాలకొల్లు :పాలకొల్లులో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా, నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నానని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన ఆదివారం ఉదయం నుంచి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత జగన్ పాలనలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు వారం వారం సమీక్షలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సామాజిక భవనం, గౌడ శెట్టిబలిజ సామాజిక భవనం, క్రిస్టియన్ శ్మశానవాటిక, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, అబ్దుల్ కలాం ఉద్యానవనం, కైలాస వనం తదితర అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కైలాస వనం ప్రాంతంలో అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో సుందరంగా అంబేద్కర్ సామాజిక భవనాన్ని నిర్మిస్తే వైసిపి పాలనలో కనీసం రంగులకు కూడా నోచుకోలేదన్నారు. అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 80 శాతం టిడ్కో గృహాలు పూర్తికాగా వైసిపి ఐదేళ్లలో మిగిలిన 20 శాతం పనులకు నోచుకోలేదన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి కొందరికి, డిసెంబర్ నాటికి మరికొందరికి గృహాలు అప్పగించేలా పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 50 పడకల నుంచి వంద పడకల స్థాయికి పెంచి ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.12.60 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన ఈ పనులు జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఐదేళ్లయినా పూర్తి కాలేదని తెలిపారు. ఆసుపత్రి భవన నిర్మాణాలను అన్ని మౌలిక వసతులతో రోగులకు మంచి ఆరోగ్య సేవలందేలా దృష్టి పెట్టినట్టు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, నరసయ్య, తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగిస్తామని ఏకపక్షంగా చెప్పడం సరికాదు

కాలుష్యానికి కారణాలపై పరిశీలించండి

నిజమైన అభివృద్ధి కోరుకుంటే ఇళ్ల తొలగింపుపై సమావేశం నిర్వహించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్లన్నీ తొలగిస్తామని ఉండి ఎంఎల్‌ఎ ఏకపక్షంగా ప్రకటించడం సబబు కాదని, నిజమైన అభివృద్ధి కోరుకుంటే ఇళ్ల తొలగింపుపై సమావేశం నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. నియోజకవర్గంలో ఇళ్ల కూల్చివేత, కాలుష్య కారణాల పరిశీలన పేరుతో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఇప్పటివరకూ సుమారు 800 ఇళ్లను, 200 షాపులను కాలుష్యం పేరుతో కూల్చేశారన్నారు. పేదల ఇళ్ల వల్లే తాగునీటి చెరువులు, కాలువలు కలుషితమైపోతున్నాయని ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు చెబుతున్నారని, అవన్నీ అవాస్తవాలే అని అన్నారు. కారణాలను పక్కనపెట్టి కేవలం పేదల ఇళ్లను మాత్రమే తొలగిస్తున్నారన్నారు. తరతరాలుగా ప్రభుత్వ పోరంబోకు భూముల్లో పేదలు వేసుకున్న ఇళ్లు ఉన్న ప్రాంతాలను యాత్ర సందర్భంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కాలుష్యానికి కారణాలు అనేక పరిశ్రమలు, ఆక్వా చెరువులే అని ప్రముఖ శాస్త్రవేత్తల అధ్యయనాల్లో తేలిందన్నారు. పరిశ్రమ కాలుష్యం ఉంటే పరిశ్రమలు మూసేయడం, ఆక్వా కాలుష్యం ఉన్నది కాబట్టి ఆక్వా చెరువులను తొలగించడం అనేది కాకుండా కాలుష్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. పేదల ఇళ్లు కూల్చడమే పనిగా పెట్టుకోవడం ఆపాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా కూడా పూర్తిస్థాయి ప్రత్యామ్నాయాలు చూపలేదని తెలిపారు. కోర్టు ప్రొసీడింగ్స్ ప్రకారమే ముందుకు వెళ్తున్నామన్న ఎంఎల్‌ఎకు ఏ కోర్టు ఇళ్లు తొలగించాలని ఆదేశాలిచ్చిందో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఇళ్ల తొలగింపుపై సమావేశాన్ని నిర్వహించాలని ఎంఎల్‌ఎను కోరుతున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, కాలుష్యాన్ని అరికట్టడానికి తగిన చర్యలను ఆ సమావేశంలో చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతేగానీ ఏకపక్షంగా అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు తొలగించడం సరైంది కాదన్నారు. ఎలాంటి సమావేశం జరపకుండా, ఎవరితోనూ చర్చించకుండా ఇలాగే కొనసాగితే తాము కూడా ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనికొండ శ్రీనివాస్, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, ఉండి మండల కార్యదర్శి చీర్ల శేషగిరిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ఆక్రమణల తొలగింపు కొనసాగిస్తాం

నిర్వాసితులకు దశల వారీగా ఇళ్ల స్థలాలిస్తాం

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలన్నీ తొలగిస్తామని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో నిర్వాసితులకు కొంతమందికి స్థలాలు కేటాయించామని, మిగిలిన వారికి దశలవారీగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. పెదఅమిరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణల తొలగింపులో పేద, ధనిక అనే తేడా ఏమీ లేదని అన్నారు. కాల్వల్లో కాలుష్యం నివారించి ప్రజలకు రక్షిత తాగునీరందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని, వాటి గురించి కూడా చెప్పి, ఆపై ఏమైనా లోపాలుంటే చెబితే బాగుండేది కామ్రేడ్స్ అని వ్యాఖ్యానించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురించి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన గురించి తనకు తెలియదని, ఎవరో స్థానికులుగా భావించి మాట్లాడానని చెప్పుకొచ్చారు. వివాదం వారి నుంచే ప్రారంభమైంది కాబట్టి వారు చెబితే తాను క్షమాపణ చెప్పడానికి సిద్ధమేనన్నారు. ఆక్వా చెరువుల కాలుష్య నివారణకు చర్యలు చేపట్టామన్నారు.



దేశవ్యాప్తంగా ఉగ్రవాద చర్యలను రూపుమాపాలి

సిపిఎం ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశవ్యాప్తంగా ఉగ్రవాద ఉన్మాద చర్యలను రూపుమాపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ మృతులకు సంతాపం తెలియజేస్తూ తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి స్థానిక పోలీస్ ఐ ల్యాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పెహల్గాంకు దగ్గరలో మినీస్విట్జర్లాండ్‌గా పేరుగాంచిన బైసరన్ వ్యాలీ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు చేసిన దాడిలో 28 మంది పర్యాటకులు మృతిచెందగా 12 మంది తీవ్రంగా గాయపడిన దారుణ సంఘటనపై సిపిఎం ఖండిస్తూ నిరసన వ్యక్తం చేసి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేసిందని ఆయన అన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో నిర్మూలించామని చెప్పే మోడీ ప్రభుత్వం ఈ ఘటనపై సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మన దేశంలో ఉగ్రవాద చర్యలు ఎక్కువ అయ్యాయని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమానికి జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, శిద్దిరెడ్డి శేషుబాబు, గుర్రం శ్రీను, పక్కుర్తి చిన అప్పారావు, యడవల్లి వెంకట దుర్గారావు, పప్పల ప్రభాకరరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

యలమంచిలి : ఇటీవల కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ ఉగ్రవాదులు జరిపిన మారణకాండ అత్యంత హేయమైన చర్యని, ఇటువంటి దాడులను కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముమ్మిడివరపు ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్, మల్లుల కోటి, మల్లుల రామకృష్ణ, కోరం వెంకటేశ్వర రావు, జిల్లెల్ల ప్రశాంతి, ముస్కూడి జయశ్రీ, శెట్టిమి నాగమణి పాల్గొన్నారు.

పెంటపాడు : కాశ్మీర్‌లోని బెలారస్ ప్రాంతం చాలా సుందరమైందని, దీనిని రెండో స్విజర్లాండ్‌గా పిలుస్తారని, ఆప్రాంతంలో ఉగ్రదాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. మండలంలోని పత్తిపాడు గ్రామం గాంధీరెడ్డి గొడామ్స్ వద్ద లంకలపల్లి అప్పారావు అధ్యక్షతన ఉగ్రవాదుల దాడికి నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ పహల్గాంకు వేలాదిమంది యాత్రికులు వస్తూంటారని, వారికి కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా, వడ్డాది సన్నాసిరావు, జక్కంపూడి బంగారు రాజు, జక్కంపూడి పెంటారావు, గెళ్ల పాపారావు, కొమ్మూరి గోపి, మజ్జి సురేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడు : కాశ్మీర్ అందాలు చూద్దామని వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవడం దురదృష్టమని అటువంటి దురాగతాలకు పాల్పడిన వారిని ఇటువంటి పరిస్థితుల్లో వదలకూడదని సిబిసిఎంసి ప్రముఖులు పాస్టర్ జాకబ్ రాజు అన్నారు. కాశ్మీర్లో ఉగ్రదాడి నిరసిస్తూ ఆదివారం రాత్రి స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిబిసిఎన్‌సి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ముందుగా మృతులకు నివాళి ఘటించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కటికతల సువర్ణ రాజు, మాజీ ఎంపిపి కట్టా నాగేశ్వరావు, చొక్కా సుబ్బారావు, సిహెచ్.ఆనంద్, గూడపాటి పాము, కె.ఏలీషా పాల్గొన్నారు.

టిడిపి నాయకుల అసత్య ఆరోపణలు తగవు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

పాలకోడేరు : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావుపై టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఎస్ఆర్ నగర్‌లో గోపాలన్ ఆదివారం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏకపక్షంగా జరుగుతున్న పేదల ఇల్లు కూల్చివేతను ఖండిస్తూ పాలకోడేరు ఎస్ఆర్ నగర్‌లో పర్యటించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఇటీవల ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలపై సిపిఎం జిల్లా కమిటీ అభ్యంతరం తెలిపిందన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్త నిరసనలకు పిలుపునివ్వగా భీమవరం పట్టణంలో కూడా ఉండి ఎంఎల్ఎ వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళన చేపట్టారని తెలిపారు. ఆ ఆందోళనలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శిగా ఉన్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు ఉండి ఎంఎల్ఎ వ్యవహరించిన తీరును ఖండిస్తూ మాట్లాడారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాజకీయ విమర్శలను తట్టుకోలేని ఉండి మండల టిడిపి నాయకులు అసత్య ఆరోపణలతో విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడడం సరైనది కాదని, వారు చేసిన ఆరోపణలను సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇల్లు కూల్చివేత మంచిది కాదని, ఇది ఆపాలని కోరడం న్యాయం కాదా అని ప్రశ్నించారు. పేదల ఇల్లు వల్ల కాలుష్యం అవుతుందని చెబుతున్న నాయకులు జిల్లాలో కాలుష్యానికి గల కారణాలను వెలికితీయాలని కోరడం న్యాయం కాదా అని ప్రశ్నించారు. కోర్టు స్టేటస్కో ఇచ్చిన ఇల్లు తొలగించడం అన్యాయమని చెప్పడం తప్పా అని అన్నారు. ఇలాంటి రాజకీయ విధానాలపై ప్రశ్నిస్తుంటే టిడిపి నాయకులు అసత్య ఆరోపణలతో వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. ఒకప్పుడు కార్మికుడిగా ఉండొచ్చు, కార్మిక కుటుంబం అయ్యి ఉండొచ్చు కానీ అతని కుటుంబ నేపథ్యం తెలియకుండా వారి నాయకులు మాట్లాడడం సబబు కాదన్నారు. ఎవరో ఏదో చెప్పిన గాలి వార్తలను భుజాన వేసుకొని మాట్లాడటం సమంజసం కాదన్నారు. టిడిపి నాయకుల మాటలను ఖండిస్తున్నామన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే ఎవరైనా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, ధనికొండ శ్రీనివాసరావు, శేషపు ఆశ్రియ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలన్

మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారుల ఆర్థికసాయం రెట్టింపు చేసిందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. మత్స్యకార గ్రామాలకు టిడిపి అండగా నిలబడిందన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం టిడిపి ధ్యేయమన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించిన చంద్రబాబు నాయుడుని అభినందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని పితాని అన్నారు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు.

మార్టేరు - పెనుగొండ రోడ్డు మూత

మండుటెండలో ప్రయాణికుల ఇబ్బందులు

పెనుమంట్ర : నరసాపురం-ప్రక్కిలంక రోడ్డు మార్గంలో విజ్జేశ్వరం-నరసాపురం ప్రధాన పంట కాలువను ఆనుకొని ఉన్న నెగ్గిపూడి(మార్టేరు) వద్ద కల్వర్ట్, పెనుగొండ పెద్ద వంతెనల రిపేర్ల నిమిత్తం శనివారం నుంచి ఈ మార్గంలో భారీ, పెద్ద లారీలు, వాహనాలతో పాటు బస్సులను సైతం దారి మళ్లించడంతో మండుటెండల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్టేరు సెంటర్ నుంచి నాలుగు మార్గాల్లో బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు మార్టేరు పక్క గ్రామాలకు వెళ్లాలన్నా బస్సు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల టిక్కెట్ రేటు ఎక్కువ ఉన్నందున ఆ భారం తప్పించుకోడానికి, ఆటోలను ఎక్కడానికి మండుటెండల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



మూసివేసిన రోడ్డు

నేటి నుంచి 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆచంట

2009 విద్యాహక్కు చట్టం 12(1)(సి) 2025-26 సంవత్సరానికి మండలంలోని అన్ని ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లలో పేద, బలహీన తరగతుల పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్‌లు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు 25 శాతం సీట్లు కేటాయిస్తు పేద, బలహీన విద్యార్థులకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఇప్పటికే తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నాయన్నారు. విద్యార్థులు ఈనెల 28 నుంచి మే 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, సంబంధిత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనేందుకు కావల్సిన డాక్యుమెంట్స్ : తల్లిదండ్రుల ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు, భూ హక్కుల పత్రం, ఎన్ఆర్‌జిఎస్ జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు కలిగి ఉండాలన్నారు. పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పెనుమంట్ర : ఆంధ్రప్రదేశ్‌లో 2009 విద్యాహక్కు చట్టం 12(1)(సి) ద్వారా 2025-26 సంవత్సరానికి మండలంలోని అన్ని ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో పేద, బలహీన తరగతుల పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తూ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు 25 శాతం సీట్లు కేటాయిస్తూ పేద, బలహీన విద్యార్థులకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఇప్పటికే తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నాయన్నారు. విద్యార్థులు ఈనెల 28 నుంచి వచ్చేనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యావనరుల కేంద్రం, సంబంధిత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకొనేందుకు కావల్సిన డాక్యుమెంట్స్ : తల్లిదండ్రుల ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు, భూ హక్కుల పత్రిక, జాబ్ కార్డు, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్ కాపీ వీటిలో ఏదైనా రెండు మాత్రం కావాలన్నారు. పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, అర్హత వయస్సు ఎల్. సిబిఎస్‌ఇ, ఐసిఎస్‌ఇ పాఠశాలల్లో ప్రవేశం కోసం 31.03.2025 నాటికి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 01.06.2025 నాటికి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. మరింత సమాచారం కోసం స్థానిక పెనుమంట్ర మండల విద్యా వనరుల కేంద్రంలో, కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని వారు కోరారు.



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లులో అన్న సమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భారీ స్థాయిలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవాలు ముగిసిన సందర్భంగా ప్రతి ఏటా ఈ అన్నసమారాధన నిర్వహిస్తారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు యర్రంశెట్టి పద్మారావు, గాదె సుబ్బారావు, ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్, గాదే వెంకన్న పాల్గొన్నారు.

రేపు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - తణుకు

యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(స్కిల్ డెవలప్‌మెంట్), నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సిఎస్) ఆధ్వర్యంలో ఎస్‌సిఐఎం గవర్నమెంట్ కళాశాల తణుకులో ఈనెల 29వ తేదీన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో గౌతమి సాల్వెంట్ ఆయిల్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, ఆక్సిస్ బ్యాంకు, అరబిందో ఫార్మా, అపోలో ఫార్మసీ మొదలైన ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీల్లో ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్, ఫార్మా అసిస్టెంట్, మెషిన్ ఆపరేటర్, లోన్ ఆఫీసర్ మొదలైన ఉద్యోగ అవకాశాలు జరుగుతుందన్నారు. వివిధ కంపెనీల్లో మొత్తం 500లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుష, స్త్రీ అభ్యర్థులు అర్హులైన కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆసక్తి ఉన్న వారు నెంబర్లు విజయకుమార్ 9618560188, నాగేంద్ర 9502024765 సంప్రదించాలని తెలిపారు.

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, జయరాజు దంపతుల కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి మోక అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావులు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు మృతి

కొత్తపేటలో విషాదం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం గ్రామం కొత్తపేటకు చెందిన మల్లుల నాని పేరుపాలెం బీచ్‌కు వెళుతూ మార్గం మధ్యలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మృతి చెందటంతో మృతుడు నివాస ప్రాంతం వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం రాత్రి పది గంటల వరకు వీరవాసరంలోనే ఉన్నాడని మిత్రులు తెలిపారు. ఆతరువాత మరో మిత్రుడు గుడాల హేమంత్ సాయికుమార్‌తో కలిసి బైక్‌పై పేరుపాలెం వెళ్లినట్లు వారు తెలిపారు. నాని స్థానికంగా ఇంటీరియల్ సీలింగ్ పనిచేస్తూ ఉంటాడు. కష్టపడే స్వభావం ఉండే నాని బైక్ యాక్సిడెంట్‌లో మృతిచెందడం పట్ల మిత్రులంతా శోకసంద్రంలో ఉన్నారు. అందరితో కలుపుగోరుతనంగా ఉండే నాని మృతిపట్ల స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తండ్రి శ్రీను కొబ్బరితీత కార్మికుడుకాగా, తల్లి లక్ష్మి దుబాయిలో పని నిమిత్తం వెళ్లినట్టు బంధువులు తెలిపారు. వీరికి పెళ్లైన కుమార్తె, ఒక కుమారుడు నాని ఉన్నారు. తన కుమారుడు మృతి విషయం ఆమెకు తెలిపామని ఆమె వచ్చేది రానిది తెలియడం లేదని కుటుంబ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు వైపు నుంచి ప్రవహిస్తున్న గోస్తని నది బ్రిడ్జి దాటిన తరువాత విస్సాకోడేరు గ్రామ పరిధిలో గోస్తని నది ప్రవాహం మధ్యలో గుర్తుతెలియని పురుష మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ ఎం.రవివర్మ తెలిపారు. రంగు నలుపు, సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటారని తెలిపారు. బ్లూ రంగు జీన్ ప్యాంట్, పొడుగు చేతులు కలిగిన ఎరుపు, ముదురు ఆకుపచ్చ, నలుపు రంగులు డిజైన్ కలిగి కాలర్ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మాసిన నలుపు రంగు గడ్డం అలాగే తలపై అంగుళం పొడవు కలిగిన జుట్టు కలిగి, చాతిపై ఎడమవైపు నాగు, కుడి వైపు నాగమణి పేర్లు, కుడి చెయ్యి మణికట్టు పైభాగంలో చిన్నారి, అమ్మ బెస్ట్ ఫ్రెండ్స్, అని అమ్మ, వెంకటేశ్వర అని, తెలుగులో పచ్చబొట్లు కలిగి, అదే చెయ్యి పైభాగంలో(స్టార్) మూడు నక్షత్రాల పచ్చబొట్లు కలిగి ఉన్నాయని, ఎడమ చేతి పైభాగంలో ఇంగ్లీషులో క్యాపిటల్ ఎన్ అక్షరాలు కలిగిన పచ్చబొట్లతో ఉందన్నారు. సుమారు ఐదు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని తెలిపారు. విస్సా కోడేరు విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం పూర్తి చేయరూ..!

ప్రజారోగ్యంపై దృష్టిపెట్టని ప్రభుత్వం

నిధులు మంజూరు చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

ప్రజలకి వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి సచివాలయంలో హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలు నిర్మాణం చేసి ప్రజలకు వైద్యం అందించడానికి వీలుగా గత ప్రభుత్వంలో హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించడానికి రూ.20 లక్షల నిధులు కేటాయించారు. ప్రజలకి వైద్యం అందుబాటులోకి వస్తుంది, తమరోగాలకి సంబంధించిన మందుల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లవలసిన అవసరం ఉండదు అనుకున్న స్థానికులకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో భవనాలు సగంలో నిలిచిపోయాయి. ఆతరువాత జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా నిధులు కేటాయింపులు చేయకపోవటంతో అసంపూర్తిగా ఉన్న హెల్త్ క్లినిక్ భవనాలు ఎందుకు ఉపయోగపడకుండా ఉన్నాయి. దీంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తొమ్మిది హెల్త్ క్లినిక్‌లు



నిధులు లేక నిలిచిన సరిపల్లి హెల్త్ క్లినిక్ భవనం

కేటాయించిన రెండు సెంటర్లలో భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన ఏడు సెంటర్లలో నిధులు లేక నిలిచిపోయాయి. అలాగే పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పది హెల్త్ క్లినిక్ సెంటర్లకి ఒక్క సెంటర్‌లో మాత్రమే భవన నిర్మాణం చేశారు. మిగిలిన తొమ్మిది సెంటర్లలో భవనాల ఊసే లేకుండా పోయింది. హెల్త్ సెంటర్లకి నిధులు మంజూరు చేసి భవనాలు పూర్తి చేయాలనే ఆలోచన అధికారులకు కలగకపోవడం వల్ల సగం నిర్మించిన భవనాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. హెల్త్ క్లినిక్‌లు పూర్తిచేసి వాటి ద్వారా ప్రజలకు మందులు అందజేయడానికి ప్రతి గ్రామంలో ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పిలను నియమించింది. వారికి విధులు నిర్వహించడానికి భవనం లేకపోవటంతో స్థానిక రైతు సేవా భవనాల్లోనుండి, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు మందులు అందజేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకి ఆరోగ్య భద్రత కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా మిగిలిన హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలకు నిధులు మంజూరు చేయడానికి వీలుగా స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కృషిచేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

నల్లచట్టాలకు వ్యతిరేకంగా మేడే నిర్వహిద్దాం

ప్రజాశక్తి - ఆకివీడు

నల్లచట్టాలు, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే డే వేడుకలను నిర్వహించుకుందామని సిఐటియు మండల అధ్యక్షులు కె.తవిటినాయుడు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో మే డే రానున్న సందర్భంగా ఆదివారం స్థానిక బంకి రాముడు బజారు ముఠా కార్మికులు జాతీయ రహదారిపై మే డే ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రోజురోజుకీ కార్మికుల పనిగంటలను పెంచుకుంటూ పోతుందన్నారు. పని సమయాన్ని 12 గంటలకు పెంచడం కార్మికుల శ్రమను దోచుకోవడమే అన్నారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా మే డేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బర్నాల అప్పలనాయుడు, రమణ, రామకృష్ణ, దాసు పాల్గొన్నారు. **ఆచంట :** మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలను, హక్కులను కాపాడుకోవడానికి ప్రతి కార్మికుడు దీక్షపూనుతూ వాడవాడలా మేడే జెండాలు ఆవిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం మేడేను

వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు నాయకులు



ఆకివీడులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

విజయవంతం చేయాలని కోరుతూ కొడమంచిలి గ్రామంలో కార్మికులను కలిసి ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్లను తీసుకువచ్చాయన్నారు. కార్మికుల పని ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల్లో విస్తృతంగా మే డే జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండి రంగారావు, పి.మోహన్ రావు, మచ్చ సుబ్బారావు, ఇంజేటి వీరయ్య, కారిపల్లి రాజు, మచ్చ మరియమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, మచ్చ రాంబాబు, నక్కచిన్న నాగరాజు పాల్గొన్నారు.

తణుకు : మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల అధ్యక్షులు ఎస్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపిలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మిక వర్గంపై మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ పేరుతో అణచివేతకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వానికి లేబర్ కోడ్స్ వద్దు, పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని చెప్పినప్పటికీ వినకపోవడం వల్లే మే 20న దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని తెలిపారు. అనంతరం మేడే వారోత్సవాల్లో భాగంగా క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, టి.కృష్ణారావు, అప్పలరాజు, నవీన్, శివకుమార్, సురేష్, రమేష్, ధనరాజు, గోవింద్, ఎస్.రాజు, లక్ష్మణ్, అచ్చుత్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణంలోని పాఠశాల విద్యార్థులకు ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6 వరకు సమ్మర్ క్లాసులు(వేసవి శిక్షణా శిబిరాలు) నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 8:30 వరకు కథలు వినడం, 8:30 నుంచి 10 గంటల వరకూ పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, 10 నుంచి 10.10 వరకు విరామం ఉంటుందన్నారు. మరలా 10.10 నుంచి 10.30 వరకు పుస్తక సమీక్ష, 10:30 నుంచి 11 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్, పలు అంశాలపై చిన్నారులకు రీసోర్స్ పర్సన్లు శిక్షణ ఇస్తారన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా గరికపాటి బాపయ్య శర్మ, వీరాస్వామి, జనవేదిక సలహాదారుడు జనర్ధనరావు, ఆర్.కుమార్, కె.వెంకటేశ్వరరావు, శ్రీదేవి వ్యవహరిస్తారు. ఈ శిక్షణా శిబిరాలలో విద్యార్థులకు యోగ, క్రాఫ్ట్ చిత్రలేఖనం వంటి అంశాలను నేర్పడంతో పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు కోరారు.

ప్రాథమిక వైద్యంపై అవగాహన

నరసాపురం : నరసాపురం పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం స్థానిక వైఎన్ కళాశాలలో ఆదివారం జరిగింది. వైద్య అవగాహనా సదస్సులో పాలకొల్లు పట్టణానికి చెందిన వివేక్ హాస్పటల్ డాక్టర్ డి.సామ్‌వివేక్ సర్జన్ ప్రాథమిక వైద్యంపై సైంటిఫిక్ క్లాసెస్‌లో మాట్లాడుతూ లాప్రోస్కోపీ ద్వారా చేయవలసిన ఆపరేషన్ కోసం తెలియజేస్తూ మారుమూల ప్రాంతంలో ఉన్నవారికి ఎమర్జెన్సీకి ఇరవైనాలుగు గంటల నొప్పి వచ్చినప్పుడు, లివర్ ప్రాంక్రియాస్ నొప్పి వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రొజెక్టర్ ద్వారా డెమో క్లాసెస్ చెప్పారు. డాక్టర్ స్పందన న్యూరో సైక్రాజిస్ట్ మాట్లాడుతూ స్మోకింగ్, ఆల్కహాల్, గంజాయ్ వంటి పలు మత్తు మందులకు బానిసైన వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా సంఘ అధ్యక్షులుగా ఎన్నికైన కనకం వరప్రసాద్ దంపతులను సంఘ సభ్యులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ కోశాధికారి మైలా కుమార్ స్వామి, స్థానిక సంఘ గౌరవ అధ్యక్షులు గుబ్బల రామారావు, కార్యదర్శి పులపర్తి అర్జునుడు, కోశాధికారి ఎస్‌కె.అజీజ్, సంఘసభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

పాలకొల్లు రూరల్: ఉల్లంపర్రు మాంటిస్సోరీస్, డాక్టర్ సబిత కాలేజీలో మానవత సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో మద్దాల రాంప్రసాద్, వాసు ఆర్థిక సహకారంతో మహిళలకు ఉచిత కేన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. రిజిస్టర్ చేసుకున్న 226 మందిని పాలకొల్లు విజయ ల్యాబ్ సిబ్బంది బిపి, షుగర్ పరీక్షలు చేసి, డాక్టర్ కుసుమ ప్రశాంతి పరీక్షలు నిర్వహించారు. గుర్తించిన వ్యాధిగ్రస్తులను 112 మందిని మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బృందం వారు బస్సులో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలతో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, మానవత సేవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పేదలపై ఎంఎల్‌ఎ దమనకాండను ఆపాలి

నరసాపురం : పేదలపై ఉండి ఎంఎల్‌ఎ దమనకాండను ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం సెంటర్లో సిపిఎం కార్యకర్తలు ఉండి ఎంఎల్‌ఎ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిని వ్యక్తిగతంగా దూషించే నైతిక విలువ రఘురామకృష్ణరాజుకు లేదన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న ఒక వ్యక్తి మాట్లాడే విధానాన్ని చూస్తే ఆ పదవికి అర్హుడు కాదని, పదవికి రాజీనామా చేయాలని రామ్మోహన్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడలి నాగరాజు, బొక్క శ్రీనివాసరావు, కవురు నరసింహస్వామి, కుక్కల శ్రీరామమూర్తి, తిరుమణి సత్యనారాయణ, కౌరు శ్రీనివాస్, గుబ్బల నాగేశ్వరరావు, కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ డిమాండ్ చేసింది. భూస్వాములకు కొమ్ము కాస్తూ పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చి వేయడంపై సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు ఫొటో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్ర రావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలిస్తామని వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక నాయకులు దానికి విరుద్ధంగా గత నాలుగు, ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్న పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చి వేయడం సరికాదని వీరభద్రరావు విమర్శించారు. బాధితులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు. పార్టీ శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరావు, యండమూరి నాగేంద్ర, వాసా పోసియ్య, ఎల్.నారాయణ, తాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నరసాపురం : లక్ష్మణేశ్వరం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి(ఇంగ్లీష్ మీడియం-స్టేట్ సిలబస్) 5వ తరగతి పూర్తి సీట్ల భర్తీకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 76 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 63 మంది హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ సిహెచ్‌కె.శైలజ తెలిపారు.

'సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'

పాలకొల్లు రూరల్ : పంట విరామం వల్ల మన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తారని, సిండికేట్ వల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు తెలియజేశారు. ఆయన ఆదివారం యలమంచిలి మండల గ్రామాలైన ఇలపకుర్రు, చింత దిబ్బ, కట్టుపాలెం, మట్లపాలెం, సిరగారపల్లి గ్రామ ఆక్వా రైతులతో సమావేశమై పంట విరామం గురించి చర్చించారు. రైతులందరూ పంట విరామానికి సంఘీభావం తెలియజేశారని గాంధీ భగవాన్ రాజు తెలియజేశారు.



విద్యార్థులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులకు సత్కారం

నరసాపురం : వాసవి క్లబ్ సభ్యులు కట్టా విజయ్, మాధవి కుమార్తె శ్రీవల్లి పదవ తరగతి ఫలితాల్లో 600కి 594 మార్కులు, నంబూరి గోపి, తులసిల కుమార్తె శ్రీరష్మితకు 600కు 584 మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కె.బాబ్జీ, జోన్ ఛైర్మెన్ అప్పన బదరి, మండ రాజా, వి.రామారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యలో అందరూ ఉన్నత స్థాయికి చేరాలి

టెన్త్ విజేతలకు మానవత ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యలో అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని, అందరి లక్ష్యం సివిల్స్ కావాలని పోడూరు ఎంఇఒ జివి.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మార్టేరులోని దేవాంగ కల్యాణ మండపంలో పెనుమంట్ర మానవత సంస్థ ఆధ్వర్యంలో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. మానవత మండల ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల ఫస్ట్ కండెల్లి జ్యోత్స్న(578), హైస్కూల్ విద్యార్థి జుత్తిగ మండలం సెకండ్ దారపురెడ్డి దుర్గా తులసి(577), జెడ్‌పి పాఠశాల, పొలమూరు మండల సెకండ్ ఎ.జస్వంత్ కుమార్(577), ఎంజెపాపబిసిర్స్ గురుకుల పాఠశాల, నెగ్గిపూడి మండలం థర్డ్ ప్లేస్ పి.రత్నశ్రీ(568), జెడ్‌పి పాఠశాల, ప్రయివేటు పాఠశాల మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులలో మండలం ఫస్ట్ చెల్లబోయిన ప్రణీత(589), వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, మార్టేరు, మండలం సెకండ్ కె.సింధు భవిత(582), వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, మార్టేరు, మండలం థర్డ్ డి.భార్గవి(579), సిహెచ్.శ్రీజనని(579), శ్రీసంఘమిత్ర స్కూల్ వెలగలేరు, అదేవిధంగా ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్లో ఈస్ట్, వెస్ట్ జిల్లాల్లో ప్రథమ స్థాయి మార్కులు సాధించినటువంటి విద్యార్థి కొండవీటి ఆదిత్య యశస్వి, పెనుగొండ ఎస్‌వికెపి జూనియర్ కాలేజీ విద్యార్థులకు క్యాష్ ప్రైస్ శాలువా, గోల్డ్ మెడల్‌తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త బి.రత్తయ్య, మాధురి ఫ్యాన్సీ స్టోర్ అధినేత డి.వెంకటేశ్వరరావు, డాక్టర్ మీనా కుమారి ప్రసాద్ వచ్చారు. మానవత చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ పడాల జగన్నాథ్ రెడ్డి, జిల్లా సభ్యులు కొత్త సత్యనారాయణమూర్తి, సెక్రటరీ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం అభినందనీయం

నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు

మొగల్తూరు : తీర ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడం అభినందనీయమని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రాలను పరీక్షించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో మొగల్తూరులోని మీనాక్షి ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారికి తొందరలోనే చేస్తామని వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, పాల రాంబాబు, దొంగ శ్రీను బంధం విజయ్‌కుమార్, కొల్లాటి గోపాలకృష్ణ, బాలకృష్ణ, తిరుమాని భాస్కరరావు, కొల్లాటి మూలస్వామి, నాగేశ్వరరావు ఉన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 309/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ **-వాది**
అండ్
చిలకపర్తి పెద్దిరాజు అండ్ అనదర్ **ప్రతివాది -ప్రతివాదులు**

సమన్స్ టు:
D-2: బద్దే విజయ్,
S/o. రాజారావు, డోర్ నెం. 3-3-12,
23వ వార్డు, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 07-05-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275,
ది. 27-04-2025 ప॥గో॥జిల్లా
సెల్: 98662 59514

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 490/2024

బిట్వీన్:
వాది : మన్నెం విజయ లక్ష్మి, W/o. భాస్కరరావు, మెంటేవారి తోట, భీమవరం, ప॥గో॥జిల్లా.
అండ్
ప్రతివాది : రాచమల్ల నాగరత్నం, W/o. గాంధీ, తిరువూరు రోడ్, నూజివీడు, ఏలూరు జిల్లా.

Order 5 Rule 20 C.P.C. ప్రకారం ప్రతివాదికి నోటీసు

పై నెంబరు ఓ.ఎస్ లో ప్రతివాది కి కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది. 18-06-2025వ సం॥రం తేదినకు** వాయిదా వేసివారు. కావున ప్రతివాది పై తేదిన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10-00 గంటలకు** హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినది గాను లేని పక్షంలో మీ పరోక్షంలో దావా తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ,
భీమవరం వాది తరుపు లాయర్,
తేది:26-04-2025 భీమవరం
సెల్: 98485 39039

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 56/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, **-వాది**
అండ్
వేముల సుశీల అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: వేముల సుశీల, W/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4th బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4th బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 05-05-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 11-04-2025 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 145/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, **-వాది**
అండ్
తొంటా హేమలత అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: తొంటా హేమలత,
W/o. శేఖర్, డోర్ నెం. 7-12, 4th బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 07-05-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 11-04-2025 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 241/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, **-వాది**
అండ్
మిద్దే స్వర్ణలీల అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: మిద్దే స్వర్ణలీల, W/o. సుబ్బయ్య, డోర్ నెం. 3-75, 4th బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, 4th బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 07-05-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 11-04-2025 ఫోన్: 08814-274628